**ఆణిముత్యాలు**

# రంగంలో తరంగం

*- సింగీతం శ్రీనివాసరావు*

---

**ప్ర**ముఖ సినీ దర్శకులు సింగీతం జూలై 1954లో 'తెలుగు స్వతంత్ర'లో రాసిన కథ ఇది. ఆయన కథకులు, నాటక రచయిత, చిత్రకారులు, బహుభాషావేత్త అనే విషయం చాలామందికి తెలియదు. పఠాభి 'సంస్కార' చిత్రానికి ఆయన సహకార దర్శకులుగా పనిచేశారు. రాజాజీ కథ 'దిక్కట్ర పార్వతి'కి సింగీతం దర్శకులు. తెలుగులో అనేక మంచి చిత్రాలు వారి దర్శకత్వంలో వెలువడ్డాయి. రాజ్‌కుమార్ హీరోగా పలు కన్నడ చిత్రాలను, తమిళ చిత్రాలను డైరెక్ట్ చేశారు. కమల్‌హాసన్ హీరోగా 'పుష్పక విమానం' మూకీ చిత్రాన్ని ప్రయోగాత్మకంగా తీసి మెప్పించారు. నిత్యోత్సాహి. సంగీతజ్ఞుడు. అర్ధశతాబ్ది తరువాత వారి కథను వెలికితీసి మా "పత్రిక" పాఠకులకు అందించడానికి ఆనందిస్తున్నాం.

---

**ఆ** మాత్రం దూరానికి బస్సు ఎక్కదలచుకోలేదు జగన్నాధం. మండుటెండలో తిన్నగా నడుస్తూ అవ్యక్తంగా చూశాడు. అసంఖ్యాక జనసమూహం కరుగుతున్న తారురోడ్లను కూడా లెక్కచెయ్యకుండా అటూ ఇటూ తిరుగుతున్నారు. సుడిగాలిలోని ఎండుటాకుల్లాగా? లేక తామున్న చిన్న ప్రపంచాన్ని వదలలేక చలనం సాగిస్తున్న పరమాణువుల్లాగా? ఏమో నిర్ణయించలేకపోయాడు జగన్నాధం. జనం ఎక్కువగా ఉన్నందున వేగం తప్పనిసరి తగ్గించాల్సి వచ్చింది. చాలామంది కాలినడక మీదనే వ్యాపారం అంతా సాగిస్తున్నారు. ఒక పుస్తకాలమ్మే వాడ్ని తప్పుకొని, జ్యోతిష్యుని మీద పడబోయి పక్కకడుగు వేయటంలో ఎదురుగా వచ్చే అమ్మాయికి అడ్డంగా నిలబడటం తప్పింది కాదు. ఆమె పక్కకు తప్పుకుంది. తదేక దృష్టితో ఆమెవంక చూశాడు. చాలా అందంగానే ఉంది. నిజంగా ఆమె పరమాణువే అనాలి. మహా వేగంతో తిరిగే విద్యుత్పూరిత సూక్ష్మాణువులతో కూడుకున్న పరమాణువు. మళ్లీ ఇంకొకసారి ఆమె వైపు చూడాలనుకుని తిరిగేలోగా ఆమె చాలా గజాలు దాటిపోయింది. ఆమె ఎర్రటి చీర వంకరలో తిరుగుతూ ఉండగా, ఎవరో ఒక ముసలాడు అడ్డం వచ్చాడు. బాగా కృశించిన బిచ్చగాడు– నిజమైన ఎండుటాకు, సుడిగాలిలోని ఎండుటాకు.

ఇప్పుడింకా మూడు గంటలే. నాటకం ఆరున్నరకు. ఉన్నట్టుండి కాస్త నీడలోకి రావటంతో అక్కడ అలాగే ఉండిపోయాడు. నీడలో నిలబడే ఆనందాన్ని వదులుకోలేక. పక్కకు తిరిగి చూస్తే అదొక పెద్ద అంగడి. బయట అద్దం వెనుక ఫ్రిజిడెయిర్లు, విద్యుత్ సాధనాలు అవీ ఇవీ అందంగా అమర్చబడి ఉంది. వాటిని చూస్తూ ఉంటే ఎంతో హాయి. ఆ పరిస్థితుల్లో వాటిని కొనడంలో కన్నా వాటిని అలా చూడటంలోనే ఎక్కువ ఆనందం కనబడింది జగన్నాధానికి. అదొక ఓదార్పు కాదు కదా. ఛ.. ఛ.. వ్యక్తిత్వ భావానికి అనుగుణమైన ఒక ప్రత్యేక సిద్ధాంతమని ఓదార్చుకున్నాడు. అద్దం వెనుక ఫ్రిజిడెయిరు తెల్లగా, అందంగా అందని చందమామలా వుంది. దాని ప్రక్కనే కనబడీ కనబడకుండా అగుపడింది అద్దంలో అతని ప్రతిబింబం. ఆ వస్తువుకు, తన ప్రతిబింబానికి అంతరం బాగా అగుపడ్తొంది. 'ఏం... చూడడం అయిందా?' అన్నది వెనుక నుంచి ఒక సన్నని గొంతు. తిరిగి చూశాడు

జగన్నాథం. ఇంతసేపూ పరధ్యానంలో లలిత అక్కడ ఉండిందన్న సంగతే అతనికి తెలియలేదు, మనసంతా తన రూపం మీద ఉన్నపుడు లలిత రూపం అద్దంలో ఎందుకు అగుపడ్తుంది?

'అప్పుడే బయల్దేరావేమిటి?' అన్నాడు జగన్నాథం. 'నేనంటే నాటకంలో పాల్గొనేవాణ్ణి. రెండు గంటలకు ముందే హాజరు కావాలి. నువ్వు నాటకాన్ని హాయిగా కూర్చొని ఆనందించే దానివి. టిక్కెట్టు ఉందిగా, ఆరు ఇరవై ఐదుకు వస్తే చాలు.'

'ఆనందం ఊరికే దొరకటం లేదు. ఆనందం కోసరం డబ్బు ఖర్చు పెడ్తున్నా తెలుసా?' అన్నది లలిత నవ్వుతూ.

'అబ్బ... ఎప్పుడూ డబ్బు డబ్బు. జగన్నాథానికీ, లలితకు ఈ విషయంలో మొదట్నుంచి అభిప్రాయభేదాలు. అన్ని వ్యాధుల్లోకి పేదరికం చాలా కఠినమైన వ్యాధి' అని ఇద్దరూ ఒప్పుకున్నారు. కానీ ధనికులకు, పేదలకు ఎక్కువ అంతరం ఉందనీ, డబ్బును సమానంగా పంచిపెట్టకపోయినా– ఒక్కొక్కరికి ఎంత యోగ్యమో అంత ఇస్తేనే దేశం బాగుపడ్తుందని జగన్నాథం వాదం. కాని ప్రపంచంలో బుద్ధిగలవాళ్లు, బుద్ధి లేనివాళ్లు యోగ్యులు, అయోగ్యులు ఎల్లప్పుడూ ఉంటారు గనుక, ఈ క్షణం అందరిని సమానంగా చేసినా మరుక్షణం మళ్లీ ధనికులు, పేదలు తయారవుతారనీ, అందువల్ల అలాంటి ప్రయత్నమే వృథా అనీ లలిత వాదన. వీరిద్దరికి స్నేహం కుదిరినప్పట్నుంచి అభిప్రాయ భేదం కూడా నాటుకు వస్తూంది. కాని ఈ రోజు దొరికింది జగన్నాథానికి మంచి ఛాన్స్. నాటకం అంతా తన భావాలతో నిండి వుంది. అందుకనే ముఖ్యంగా లలితను నాటకానికి రమ్మని ఆహ్వానించాడు.

ఇద్దరూ నాటకాల వైపు బయలుదేరారు.

'ఇంత తొందరగా నేనెందుకు? నేనలా కాస్త గుడ్డల షాపులు తిరిగి చూసొస్తా'నన్నది లలిత.

'ఏం? నీకు కూడా కొనడంలోకన్నా చూడటంలో ఆనందం ఎక్కువా?' అన్నాడు జగన్నాథం. ఇద్దరూ నవ్వారు.

'థియేటర్‌లో కలుసుకుందాం' అంటూ జగన్నాథం చరచరా నడచి వెళ్లిపోయాడు. లలిత కొంచెం దూరం నడచి ఒక గుడ్డల అంగడి లోనికి వెళ్లింది.

గ్రీన్‌రూమ్‌లో ఒకటే హడావిడి. జగన్నాథం వేషం చాలావరకు పూర్తి అయింది. తనదొక ఫ్యాక్టరీ ప్రొప్రయిటర్ వేషం. అద్దంలో చూచుకున్నాడు. నిజంగా లక్షాధికారిలా అగుపడ్తున్నాడు. వేషం వేసి ధనికుడిలా అగుపడవచ్చు గాని తెలివిగలిగినవాడులా అగుపడగలడా?

'ఏది ఎలా వున్నా నీ మీసం భలేగా ఉందోయ్' అన్నాడు బిచ్చగాని వేషంలో వున్న ప్రకాశరావు. అతనికి మూడు మేడలు, ఒక కారు, ఒక లారీ వున్నాయి. ఉన్నట్టుండి నిశ్శబ్దం. ఇంకా పది నిముషాలు మాత్రం ఉందనీ, త్వరితంగా తయారుకమ్మనీ దర్శకుడు బిగ్గరగా హెచ్చరిస్తున్నాడు. ఆ పది నిముషాలు కూడా దాటిపోయింది. అందరూ స్టేజి వైపు పరుగెత్తారు. జగన్నాథం మరొకసారి అద్దం వైపు చూచుకొని, స్టేజి మీదకు వచ్చి, నలుగురితో 'ప్రార్థన' మొదలెట్టాడు. పక్క కర్టన్‌కు చాటుగా దర్శకుడు నాటకం పుస్తకం చేతపట్టుకుని మాటలందివ్వడానికి సిద్ధపడ్తున్నాడు. ప్రార్థన పూర్తి అయింది. అందరూ పక్కలకు వచ్చేశారు. స్టేజి అంతా ఖాళీగా వుంది. బంగళా మేడ గదిలా అమర్చబడి వుంది.

తెర లాగబడింది. జగన్నాథం మరొక ధనికునితో తిన్నగా స్టేజిలోకి నడిచాడు. లైట్ల మధ్య కళ్లు చెదురుతున్నా ఎలాగో అలాగ సమాళించుకొని మొదలెట్టాడు.

'ఏమండీ, రాజారావుగారు... నే మొదట్నుంచి మీకు చెబుతూనే వున్నా. ఫ్యాక్టరీ మేనేజర్‌గా మిమ్మల్ని నియమించింది ఫ్యాక్టరీ పని చూసుకోటానికి. కచ్చితంగా వుంటే– ఉండవలసిన రీతిగా వుంటే– ఈ చిక్కులు, ఈ సమ్మెలు అన్నీ ఎందుకొస్తాయి?'

రాజారావుః అది కాదండీ. నేను...

ఏమిటో, తను కంఠస్థం చేసిన వాక్యాలు దంచుతున్నాడు. జగన్నాథం వినదలుచుకోలేదు.

లలిత ఎక్కడ కూర్చొని ఉందో అనుకుంటూ 'రాజారావు' వాక్యాలకు మధ్య మధ్య 'ఆహా..' అంటూ నాటకానికి వచ్చినవారిని అలా ఒకసారి చూశాడు. సముద్రంలా ఉంది జనసమూహం. లలిత ఎక్కడా కనబడలేదు. ఉన్నట్టుండి దర్శకుని హెచ్చరిక. 'అది నాకు తెలియక కాదు' అంటూ అందిస్తున్నాడు. జగన్నాథం అందుకున్నాడు.

'అది నాకు తెలీక కాదు, రాజారావుగారూ...'

దర్శకుడుః (చిన్నగా) ప్రపంచంలో అందరు–

జగన్నాథంః 'ప్రపంచంలో అందరూ వ్యక్తిత్వంగా సమానులే. ఒప్పుకుంటాను. బీదవాళ్లు ఉండవలసినదానికన్నా బీదవాళ్లుగా ఉన్నారు. ధనికులు ఉండవలసినదానికన్నా ఎక్కువ ధనికులుగా ఉన్నారు, ఒప్పుకుంటా. మీరలా ఉండకూడదంటారు' జగన్నాథం తనలో సంతోషించుకున్నాడు. 'లలిత బాగా వింటూంది కదా. కాని రాజారావుగారు, అలాంటి భేదం లేకుండా ఉండి ఉత్సాహం నశిస్తే ఫ్యాక్టరీయే ఉండదు. దేశమంతా మాడిపోతుంది. ఒక్క మాట. బయట నుంచి అందరూ మమ్మల్ని గురించి అనుకుంటారు గాని– మా బాధ్యతలూ, కష్టాలూ ఎవ్వరికీ తెలీదు.'

జగన్నాథం ఆలోచించాడు. ఎవ్వరికీ వాళ్ల కష్టాలు తెలీదా? అసలు అలాంటి తర్కమే అతనికి స్ఫురణకు రాలేదు. దర్శకుని సహాయంతో రాజారావు తన పెద్ద స్పీచ్ చెప్తున్నాడు అటూ ఇటూ తిరుగుతూ. మధ్య మధ్య కొన్ని మాటలకు సభికులు నవ్వుతున్నారు. జగన్నాథానికి మటుకు తానాడిన మాట కలవరపెట్టింది. ఇప్పుడు వేషంలో తను ఫ్యాక్టరీ ప్రొప్రయిటర్. తన కష్టాలు ఇతరులకు తెలీదూ? మిగతా వాళ్లంతా తెలుసుకోక మాట్లాడ్తారా? అంటే లలితతో తను ధనికులను గురించి మాట్లాడింది. విషయాలు తనకు సక్రమంగా తెలియకనా?

మళ్లీ తనేదో మాట్లాడాడు. రాజారావు మాట్లాడాడు. కోపంతో రాజారావు వెళ్లిపోవటంతో రంగం పూర్తి అయింది. తెరపడడంతో తెరవెనుక చప్పట్లు జోరుగా వినవస్తున్నాయి. అంతా చక్కగానే సాగిపోయిందని దర్శకుడు సంతోషించాడు. మళ్లీ సీన్లు మార్చారు. రెండవ రంగం మొదలెట్టింది. రంగం తరువాత రంగం మారుతూంది. కాని జగన్నాథానికి అంతకుముందు తన భావాలు తప్పా? అనేది కలవరపెడ్తూ ఉంది. అంతకుముందు తను జగన్నాథం ఏ విధంగానైనా

## ఫోన్

ట్రింగ్‌మంటూ
కిలకిల నవ్వుల పిలుపులు
ముద్దొచ్చి ఎత్తుకుంటే
మాటల కులుకులు
.....

కన్నీటి వరదల్ని
స్విమ్మింగ్ పూల్‌లోకి
మళ్లించుకుని
ఖుషీగా జలకాలాడే మీకు
కరువెలా కన్పిస్తుంది...?!
భూమి గుండెకోత
కేకెలా విన్పిస్తుంది...?!
.....

రూపాయి ఖర్చు లేకుండా
వేల చుక్కల బల్బులు
వెల్గించుకునే
ఆకాశానికేం తెల్సు...?!
కరెంట్ బిల్లుల
గునపం బాధ...?!
.....

కడలిని
కడుపులో దాచుకున్నా
నీకింకా
దాహార్తి
తీరలేదా ధరణీ...?!

– అయినంపూడి శ్రీలక్ష్మి

అనుకొని ఉండవచ్చు. ఇప్పుడు ఫ్యాక్టరీ ప్రొప్రయిటర్. ఇప్పుడు అనుకునే విధం వేరు. ఫ్యాక్టరీ ప్రొప్రయిటర్ మాట్లాడిన ప్రతి వాక్యానికి తను మారిపోవడం జగన్నాథం గమనించగలిగాడు. ధనికులకు, పేదలకు మధ్య అంతరం విడదీసినప్పటికీ లాభం లేదు. విడదీయలేరు. అది సంఘానికే లేదు. ఇది ప్రొప్రయిటర్ వాక్యాలలోని సారాంశం. అదే తను స్టేజి మీద కూడా చెప్పింది. అదే లలిత అంతకుముందు చెప్పింది కూడా. ఇప్పుడిప్పుడు లలిత చెప్పిందాంట్లో నిజం కనిపిస్తూంది జగన్నాథానికి.

స్టేజి మీద గగ్గోలుగా ఉంది. పది మంది ఫ్యాక్టరీ పనివాళ్లు 'ప్రొప్రయిటర్ గారు' అంటూ అరుస్తూ 'ఎక్కువ జీతాలు కావాలి' అనే బోర్డు పట్టుకుని అరుస్తున్నారు. జగన్నాథం స్టేజిలోకి వచ్చాడు. ఈ రంగంలోనే క్లయిమాక్స్ రావాలంటూ దర్శకుడు చెప్పాడు. జగన్నాథం ఓదారుస్తూ మాట్లాడాడు. 'ఇదిగో చూడండి. మీ కష్టాలన్నీ నాకు తెలుసు. కాని ఊరికే సమ్మెలు చేస్తే నే మాత్రం ఏం చెయ్యగలను? నాకు కారు ఉంది నిజమే. కాని అది ఫ్యాక్టరీకి చాలా ముఖ్యం. అది లేకపోతే మీకే కష్టం.'

ఫ్యాక్టరీ పనివాళ్ల దగ్గరనుంచి ఒకటే అరుపు. అందులో ఒకతను 'అదికాదయ్యా' అంటూ మొదలెట్టాడు కోపంగా ఏడుస్తూ, 'నిన్న నా చిన్న కూతురును హాస్పిటల్‌లో చేర్పిస్తే చూసుకునే దిక్కు లేదు. ఎప్పుడో ఇచ్చే జీతం ఇప్పుడు ఇమ్మన్నా, మేనేజర్ గారు మిమ్మల్నడగమంటారు. మీరు దొరకరు.'

ఇంకొకడుః 'మాకు అన్నం లేకపోతే ఒకరోజు అప్పిస్తారు. రోజూ ఎందుకు ఇస్తారు? పస్తున్నాం. ఇలా వుంటే నెలాఖరులో చస్తాం.'

'అక్కర్లేదు' అంటూ ఒక కంఠం. స్టేజిలోకి రాజారావు దిగాడు. ఇప్పుడు అతను పనివాళ్లకు నాయకుడు. 'ఏమండీ ప్రొప్రయిటర్ గారూ, మీ కష్టాలు అంటూ మా కష్టాలు చూడకపోతే ఎట్లా? ఎలాగైనా మీరు దీనికి సదుపాయం చూడాలి. లేకపోతే చూచి తీరుతారు ప్రపంచంలో–' అంటూ ఒక పెద్ద లెక్చర్ కొడ్తున్నాడు.

జగన్నాథం వినలేదు. అవన్నీ అంతకుముందు తనకున్న భావాలు. ఇప్పుడు కాదు. రాజారావు ప్రొప్రయిటర్ వేషం వేసి వుంటే తెలిసి ఉండేది అసలు సంగతి. రాజారావు వాక్యాలు వింత కలిగించినా జగన్నాథం మాత్రం చలించలేదు. నాటకం పూర్తి అయ్యేటప్పటికి లలిత మాటలు నూరుపాళ్లు నిజం అంటూ నిశ్చయించుకున్నాడు జగన్నాథం. ప్రొప్రయిటర్ ఇంటి ధ్వంసంతో ఫ్యాక్టరీ పనివాళ్ల 'జై జై' నాదాలతో– నూతనమైన ఎర్రటి కాంతితో నాటకం ముగిసింది. తెర పడగానే చప్పట్లు ఆగకుండా వినబడ్తున్నాయి. 'భేష్, భేష్' అన్నారు అందరూ. దర్శకుడు ఆనందంతో ఉప్పొంగిపోయాడు.

జగన్నాథం ఇదంతా వినదలచుకోలేదు. వెంటనే తన వేషం తీసి, మామూలు జగన్నాథం అయిపోయి, లలితతో తన తప్పు ఒప్పుకోవాలనుకున్నాడు. గ్రీన్‌రూమ్ వైపు పరుగెత్తాడు. మీసాలు తీసేసి, ముఖం కడుక్కొని గుడ్డలు మార్చుకున్నాడు. దువ్వుకుంటున్నాడు. హాల్ అంతా హడావిడిగా ఉంది. అద్దంలో నుంచి దూరంగా– లలిత వైపునకు పరుగెత్తాడు.

'లలితా' అన్నాడు ఆవేశంతో.

'జగన్నాథం... భేషుగ్గా నటించావ్. అద్భుతంగా ఉంది నాటకం' అన్నది లలిత సమానమైన ఆవేశంతో.

'కాదు లలితా... నిన్న మనం అనుకున్నాం. అంతకుముందు మన భావాలు.'

కాని అడ్డుపడింది లలిత.

'అదంతా మరచిపో జగన్నాథం... ఇందాక నీ నాటకం చూచినప్పటి నుంచి నా భావాలన్నీ మార్చేసుకున్నా. అసలు సంగతి తెలియక పిచ్చి భావాల్లో పడ్డా. ఆఖరుకు నువ్వే సరి.'

'కాని, లలితా–'

'ఆలస్యమైందా? రేపు కలుసుకుందాం. ఇక్కడ గొడవగా వుంది. నే వెళ్తా' అంటూ తిరిగి వెళ్లిపోయింది. అవ్యక్తంగా ఆలోచిస్తూ నిలబడ్డాడు జగన్నాథం.

●